

ముఖం అందంగా బాగానే ఉంది. పచ్చని దృఢమైన శరీరం. భారీ విగ్రహం. కళ్ళు కూడా ఏవో దూరతీరాలనున్న అందాల్ని చూస్తున్నట్లు మంచి కాంతితో ఆకర్షణీయంగా ఉంటాయి. అయితే ఏం? బుద్ధ విగ్రహం. తనతోపాటు ప్రొద్దుట పదిన్నర మొదలు సాయంత్రం అయిదువరకు ఆ గదిలో ఒక అందమైన యువతి కూర్చుంటూ ఉంటే ఆమె ఉనికినే పట్టించుకోడు. మరి.

ఆఫీసులో తన సీటులో కూర్చుని, ఆ రోజున టైపు చెయ్యవలసిన కాగితాల్ని మాటవరసకి పరిశీలిస్తూందన్న మాటేకాని, సరళ దృష్టి అంతా

ఎదురుగుండా సీటులో కూర్చుని ఆఫీసు ఫైళ్లలో తలదూర్చి, పొద్దుటి నుంచి కేవలం ఒక జడపదార్థంలా ఉలక్కుండా, పలక్కుండా తన పనేదో తను చేసుకుపోతూన్న గోపాలంమీద ఉంది. ఈ బుద్ధావతారం ఈ సీట్లోకి కొత్తగా మారి రెండు రోజులైంది.

ఇంతక్రితం ఈ అయిదు అంతస్తుల ఆఫీసులోనూ ఏ సెక్షన్‌లో ఉండి వచ్చాడో తెలియదు కాని, ఈ సీట్లోకి మారి తన ఎదురుగుండా వేంచేసిన తరవాత అతని గురించి తెలుసుకో కుండాను, అధమం ఆలోచించకుండాను ఉండలేకపోతోంది.

'పక్కవాళ్లని కొంచెమైనా పలక రించకుండా మరీ యంత్రంలా తల వంచుకొని ఆ వ్రాసుకోవడం ఏమిటి? కర్మ! ఈ యంత్రానికీ నాకూ ఒక గదిలో వచ్చి పడ్డాయి సీట్లు! నోరు విప్పి మాట్లాడడు సరిగదా, ఆ అంద మైన కోలముఖం, ఆ నొక్కునొక్కుల అందమైన జుట్టు కనిపించకుండా మొహానికి ఆ ఫైల్సుకూడా అడ్డం పెట్టుకుంటాడేమిటి? అయ్యో రాత! ఈ మూగ యంత్రంకంటే, ఏం అతిగా వాగినా ఆ వాసే నయం. రోజు కో అరడజను సార్లయినా గుడ్‌మార్నింగ్ కొట్టేవాడు. ఎంత చీదరించుకున్నా చిన్నబుచ్చుకోకుండా ఏవో అర్థంలేని పలకరింపులు పలక రిస్తూ ఉండేవాడు. "కులాసాగా ఉన్నారా" అనీ, "ఫలానా పత్రికలో ఫలానా కథ చదివారా" అనీ, "ఏం, ఈ వేళ అలా ఉన్నారు? మీ అందమైన ముఖానికి ఆ బొట్టుబుడిపాటు ఏమీ బాగాలేదు సుమండీ" అనీ—ఇలా ఏవో అంటూనే ఉండేవాడు. తన చుట్టూ ఓ గ్రహం తిరుగుతూందని లోపల ఆనందంగా ఉన్నా, మరీ ఆ వాసు చేసే చేష్టలు చూస్తుంటే అసహ్యం వేసేది. చిన్నప్పుడు కాలేజీలో చేరిన రోజు లగాయతు, ఈ ఆఫీసులో మొట్టమొదటిసారిగా ప్రవేశించి పనిచేస్తూన్న ఈ రోజుదాకా తన చుట్టూ ఏవో ఒకటో, రెండో గ్రహాలు తిరుగుతూ ఉండడం, వాళ్ల గొడవ పట్టించుకో కుండా తను నిర్లిప్తంగా ఉంటూ ఉండ డం అలవాటు. ఎప్పుడూ ఒకళ్లు తన గురించి ఆలోచించడమే కాని, తను ఒకళ్ల గురించి ఆలోచించి ఎరగదు.

'అటువంటిది, ఈ అందమైన బుద్ధవిగ్రహం ఈ గదిలోకి వచ్చి ఎదురుగుండా ఉన్న సీటుని ఆక్రమించు కొన్నది లగాయతు ఆలోచనలన్నీ ఏకమై అటే పరుగెడుతున్నాయి. మొహం అందంగా బాగానే ఉంది. పచ్చని దృఢమైన శరీరం. భారీ విగ్రహం! కళ్లుకూడా ఏవో దూరతీరాలనున్న అందాల్ని చూస్తున్నట్లు సుంచికాంతితో ఆకర్షణీయంగా ఉంటాయి.

'అబ్బ! ఇంత అందమైన యువకుడు తనతో కలిసి పొద్దున్న పదిన్నర మొదలు సాయంత్రం అయిదింటిదాకా ఈ గదిలో కూర్చుంటూంటే, అతనితో మాట్లాడకుండా ఎలా ఊరుకోవడం! అందుకే ఒకటి, రెండు సార్లు కావాలని పలకరించి చూసింది సరళ — "ఇలా చూడండి, మిస్టర్. ఈ కాగితానికి ఎవర ట్రూ కాపీ లని కొట్టాలా? దీనికి కాపీ కావాలా, అక్కర్లేదా? ఈ కాగితం ఈవేళ అర్జెంట్ అంటారా?" అంటూ. తను అడిగిన వాటి కన్నిటికీ అతను అవును, కాదు అంటూ ముక్తసరి సమాధానాలు చెప్ప డం, తను మరీ ఇబ్బంది అయిన ప్రశ్న అడిగితే, సన్నగా నవ్వి ఊరుకోవడం- ఇంతకుమించి అతను చొరవ తీసుకుని మరికొంతసేపు మాట్లాడడం లేదు.

'సంభాషణలని అంత నిర్దయగా అతను తుంచేస్తూంటే, తనకి బలే కోపంరాసాగింది. "ఊఁ, "ఆఁ"అంటూ ఏమి టా హొయలు! తనే అందమైన వాడినని గర్వం కాబోలు! ఎంత అందం ఉంటేమాత్రం అంత చేటు గర్వమా?'

సరళ తనలో తను నవ్వుకుంది. 'పాపం, అతనికి గర్వం ఏమిటి? మొహం చూస్తే అలా అనిపించడం లేదు. మరి గర్వం కాకపోతే సరిగ్గా మాట్లాడ డేం? అధమం ఇటు తిరిగి చూడడేం?' కొద్దిగా దగ్గి గొంతు సవరించుకుని, గాజులు కదిపి గంగలుమనిపించి చూసింది. 'ఉహుఁ! ఆ ప్రవరాఖ్యుడి కేం వినిపించ లేదు. బహుశా స్త్రీని కన్నెత్తి చూడ నని శపథం చేశాడేమో! లేదా ఏ స్త్రీ చేతనైనా బలంగా మోసగించబడ్డా డేమో! అదీకాకపోతే సతీమణికి సదా విధేయుడేమో!

'అన్నట్లు ఇంతకీ ఇతనికి పెళ్ల యిందా? అయిం దనుకోవడంలో కంటే కాలే దనుకోవడంలోనే మనస్సుకి శాంతిగా అనిపిస్తూంది, ఎందుకో! అయినా అయిందో లేదో, తెలుసుకోవాలి. ఎలాగ? అతన్నే అడిగితే? ఏమని? "ఏమండీ,గోపాలంగారూ, మీకు పెళ్లి అయిందా" అనా? ఛ.. ఛ... మరి ఏమిటి చెయ్యడం? ఓ రోజున అయిదు కొడుతూంటేనే కుర్చీలోంచి లేచిన గోపాలాన్ని చూసి నవ్వుతూ, "ఏమండీ! అంత ఠంచన్‌గా అయిదు కాగానే వెళ్లిపోతూ ఉంటారు. ఆలస్యం అయితే ఇంటిదగ్గర అర్ధాంగిగారు ఆగ్ర హిస్తారా?" అంది. అందుకు గోపాలం చిన్నగా నవ్వి ఊరుకున్నాడేకాని, సమాధానం ఏం చెప్పలేదు.' ఆ నవ్వు ద్వారా అతనికి పెళ్లి అయిందో, లేదో అర్థం కాలేదు సరళకి.

ఆ సంగతి తెలుసుకుంటేనే కాని, సరళకి స్థిమితం ఉండేలాగ కనిపించ లేదు. అందుకే ఆ మరునాడు అరగంట ముందుగానే ఆఫీసుకి వచ్చింది. లిఫ్ట్‌లో పై అంతస్తులోకి పోబోతూన్న వాసుని యథాలాపంగా అడిగినట్లు అడిగింది— "అవునూ. . . ఇంతకీ గోపాలంగారికి పెళ్లయిందా?" అని.

"భలేవారే! పెళ్లా? ఇద్దరు పిల్లలు కూడానూ" అంటూ లిఫ్ట్‌లోకి ఎక్కేశాడు వాసు.

సరళ తన సీటులోకి వచ్చి కూచుని ఆలోచించసాగింది. 'గోపాలానికి పెళ్ల యిందా? అతని భార్య ఎలా ఉంటుందో! అతనికి ఉన్న గర్వాన్నిబట్టి చూస్తే ఆమె అందంగానే ఉండ ఉండాలి. నా కంటేనా?' సరళ గర్వంగా తనలో తను నవ్వుకుంది. 'ఏమైనా ఆమె నో మాటు చూడాలి. అవును. ఏదో ఒక వంక బెట్టుకొని వాళ్ల ఇంటికి వెళ్లి చూడాలి!'

"గోపాలంగారు ఉన్నారాండీ?" అంటూ పోస్టుమన్ ఆమెని పలకరించ డంతో సరళ తన ఆలోచనలోంచి బయటపడింది.

"ఇంకా రాలేదు. వచ్చే వేళయింది. ఏం?"

"ఆయనకి మనియార్డర్ ఉంది."

"ఎక్కడినుంచి? ఏది?" అంటూ కుతూహలంగా తీసుకొని కూపన్‌లోకి చూసింది. "ఫలానా సంచికలో మీరు వ్రాసిన కథకు ప్రతిఫలం, ఏభై రూపాయలు!"

'వాట్! ఈ గోపాలం కథకుడా?'

ఆ రోజల్లా సరళ గోపాలాన్ని ఆశ్చర్యంతో పరిశీలిస్తూనే ఉంది. అతను మామూలుగా వంచిన తల ఎత్తకుండా తన పని తను చేసు కుంటూనే ఉన్నాడు. ఆఖరికి ఉండబట్ట లేక అడిగేసింది—"ఏమండీ, గోపాలం గారూ, చెప్పారే కాదు. . . మీరు కథల్కూ వ్రాస్తారా?" అని.

అతను ముక్తసరిగా నవ్వి, "ఆఁ ఏదో...అప్పుడప్పుడు" అన్నాడు.

అతని ముభావం చూస్తే సరళ కీ మాటు చిరాకే వేసింది. "అలా చెప్పండి . . . అప్పుడప్పుడు వ్రాస్తారు కనకే తరుచు మీ పే రెప్పుడూ పత్రికల్లో చూసిన జ్ఞాపకం లేదు" అంది హేళనగా.

గోపాలం మాట్లాడలేదు.

"మీ కథలు పడిన పత్రికలు ఏమైనా ఉంటే ఇస్తారా? చదివి ఇస్తాను" అంది సరళ కొంటెగా అతనికేసి చూస్తూ.

"అలాగే. . . తీరిగ్గా వెతికి ఇస్తాను" అన్నాడు గోపాలం.

"ఓహో! వెతకాలా? వెతికితే కాని కనిపించనంతటి కొద్దిపాటి రచన లన్న మాట! పోనీలెండి, పాపం! నా కోసం శ్రమపడి వెతక్కండి" అంది సరళ, నోట్లో నాలికని గుండ్రంగా రెండు బుగ్గల్నీ ఉబికించేలా తిప్పుతూ.

ఇంకో రోజున ఉన్నట్టుండి మొదలుపెట్టింది సరళ — "అబ్బబ్బ! ఈ పత్రికలతోటే, కథలతోటే విసిగి పోతున్నాం అండీ. ఒక్క కథా పట్టుగా ఉండదు. ప్రతిదీ ఎక్కడో చదివినట్లు ఒకే మూసలో పోసినట్లుంటుంది. సీరియస్‌గా ఉండవలసిన కథ వరపు చెత్తగా నవ్వు వస్తూ ఉంటుంది. నవ్వు రావలసిన కథలన్నీ ఏడుస్తూ ఉంటాయి. మరి ప్రతివాడూ కథ వ్రాయడమే! ఈ ఊరిమట్టుకి ఈ ఊళ్లో పదిహేనుగురు కథకులు ఉన్నారట! మా వీథిలోనే ఉన్నారట అందులో ముగ్గురు. ఖర్మ" అంటూ.

గోపాలం ముఖంలో సరళ ఆశించిన మార్పులేం కనిపించలేదు. 'ఇతనికి తన మాటల్లోని వ్యంగ్యం అర్థం కాలేదా? ఈమాత్రం వేళాకోళం చేసేటప్పటికి, బిక్కమొహం వేసి, ఏం సమాధానం చెప్పాలో అర్థంకాక, హేమా హేమీల్లాంటి యువకులంతా కుదే లయిపోయేవారు. ఇలాగే కదూ, ఈ మధ్యన నెల కో యువకుడు చొప్పున, తను ఏడిపించే ఏడిపింపుకి ఆగలేక బేజారెత్తిపోయి ఆ సీట్ లోంచి మాటా

**పోలాప్రగడ రాజ్యలక్ష్మి**

